సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం, 21 అక్టోబర్, 2023



## నెమలి వాహనంపై రాజన్న విహరింపు



వేములవాడ: రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఉత్సవమూర్తులను నెమలి వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఈవో కృష్ణప్రసాద్, ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### కరుణించు కాత్యాయనీ



కాత్యాయనీ అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

వేములవాడ: శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాజన్న ఆలయంలో అమ్మవారు కాత్యాయనీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలోని నాగిరెడ్డి మండపంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈవో కృష్ణప్రసాద్ దంపతులు పాల్గొన్నారు.

### బతుకమ్మను బతికించుకోవాలి



బతుకమ్మ కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు, వక్తలు

సిరిసిల్లకల్చరల్: తెలంగాణ ప్రజల అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ స్వరూపం నానాటికీ మారిపోతోందని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల సాహితీ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మణ్ ప్రింటర్స్‌లో కవి సమ్మేళనం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయసంస్థ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య, అఖిల భారత తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు జూకంటి జగన్నాథం, సమితి ప్రతినిధులు డాక్టర్ జనపాల శంకరయ్య, ఐక్య మహిళా వేదిక అధ్యక్షురాలు గుజ్జె తార, కోడం నారాయణ తదితరులు మాట్లాడారు. ఆధునికత పేరుతో బతుకమ్మ సహజమైన ఆటపాటల స్వరూపం మారిపోయిందని, గుజరాతీ సంస్కృతిని తెస్తున్నారన్నారు. ఉయ్యాల పాటల ఊసే లేకుండా డీజే చప్పుళ్ల మధ్య బతుకమ్మ నలిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంగల లక్ష్మణ్, వెంగలి నాగరాజు, చిటికెన కిరణ్‌కుమార్, ఆడెపు లక్ష్మణ్, సంగీతం సత్యనారాయణ, చంద్ర ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర ప్రభుత్వం మాలలకు అన్యాయం చేస్తోంది




మాట్లాడుతున్న రాగుల రాములు

సిరిసిల్లఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో మాలలకు అన్యాయం చేస్తోందని మాలమహానాడు జాతీయ నాయకుడు రాగుల రాములు పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్ సంఘాలు బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించడం సరికాదని ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని అన్యాయం చేసిందన్నారు. సిరిసిల్ల నియోకవర్గంలో మాలలు దళితబంధు పథకం అమలుకు నోచుకేలేదన్నారు. ఒక్కప్పుడు సామాన్యులుగా ఉన్న వారు ఇప్పుడు ఎకరాలకు ఎకరాల భూములు ఎలా సంపాదించారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్‌కు తాము మద్దతు ఇవ్వబోమని తెలిపారు. నాయకులు తుంగ శివరాజ్, నాలుక సత్యం, రొడ్డ రామచంద్రం, ఎడ్ల రాజ్‌కుమార్, మంగ కిరణ్, రెడ్డిమల్ల దేవేందర్ పాల్గొన్నారు.

### రాజన్న దర్శనానికి..



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ: దసరా సెలవులు కొనసాగుతుండడంతో శుక్రవారం రాజన్నను పది వేల మంది దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు.

### రూ.4.16 లక్షలు పట్టివేత

వేములవాడ: వేములవాడ పట్టణ శివారులోని సాయిరక్ష దాబా ప్రాంతంలో శుక్రవారం ఓ కారును తనిఖీ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది రూ.4.16 లక్షలు సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో జప్తు చేసినట్లు పేర్కొన్నారు.

## మూలవాగు..పూలజాతర









- వేములవాడలో ఘనంగా సద్దుల సంబురం
- ఆకట్టుకున్న రంగురంగుల బతుకమ్మలు
- ఆడిపాడిన ఆడపడుచులు

వేములవాడ: వేములవాడలో సద్దుల సంబురం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆడపడుచులు తంగేడు..గునుగు..బంతి..చామంతి పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. యువతులు దాండియా ఆటలతో సందడి చేశారు. మూలవాగుతీరం.. పూలవనంలా మారింది. మున్సిపల్ ఆఫీస్ నుంచి గౌరమ్మతల్లి విగ్రహాన్ని మూలవాగుకు ఉదయం తీసుకొచ్చారు. బతుకమ్మఘాట్ వద్ద విద్యుత్‌దీపాలతో అలంకరించారు. కోర్టు ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి నట్టు రవీందర్, జడ్జీలు జ్యోతిర్మయి, ప్రవీణ, మహిళా అడ్వకేట్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, వైస్‌చైర్మన్ రాజేందర్, ఎంపీపీలు మల్లేశంయాదవ్, బూర వజ్రమ్మ, అరుణోదయ సాంస్కృతి సమాఖ్య చైర్‌పర్సన్ విమలక్క, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ నామాల ఉమ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్, బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, బీజేపీ నాయకులు సీహెచ్.వికాస్‌రావు, డాక్టర్ దీపిక, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ పాల్గొన్నారు. డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ కరుణాకర్, కృష్ణకుమార్ ఆధ్వర్యంలో వంద మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



బతుకమ్మతో విమలక్క



బతుకమ్మతో మహిళలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు



వేములవాడ కోర్టు ఆవరణలో..



గౌరమ్మతో వివిధ పార్టీల నాయకులు



వేదికపై నాయకులు



గౌరమ్మతో చైర్‌పర్సన్లు అరుణ, మాధవి, ఇతర నాయకులు



తిప్పాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నిమజ్జనం చేస్తూ..



వాయినం ఇస్తూ..

# అందరికీ అభయ హస్తం

- ఉమ్మడి జిల్లాలో ముగిసిన విజయభేరి యాత్ర
- కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం
- అధిక సంఖ్యలో హాజరైన కార్యకర్తలు, ప్రజలు
- జీవన్‌రెడ్డిని అభినందించిన రాహుల్



మల్యాల వద్ద దోశ తింటూ.. ముచ్చటిస్తూ..



జగిత్యాలకు చేరుకుని ప్రజలకు అభివాదం చేస్తున్న కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ

సాక్షిప్రతినిధి,కరీంనగర్/జగిత్యాల/కొత్తపల్లి/మల్యాల: రాహుల్‌గాంధీ విజయభేరి యాత్ర కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. పెద్దపల్లి జిల్లాలో గురువారం మంథని వద్ద ప్రవేశించిన రాహుల్‌గాంధీ యాత్ర.. శుక్రవారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మీదుగా నిజామాబాద్ జిల్లాలో ప్రవేశించింది. కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరిస్తూ.. బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం విధానాలను ఎండగడుతూ రాహుల్‌గాంధీ ముందుకుసాగారు. కాంగ్రెస్ కార్యకర్తలను బెబ్బులితో పోలుస్తూ ఉత్సాహం నింపారు. అత్యవసర పనులు ఉండడంతో గంగాధర కార్నర్‌మీటింగ్, కొండగట్టు దర్శనం రద్దయ్యాయి. అయినా.. ఆయా ప్రాంతాల్లో ఎదురుచూస్తున్న స్థానికులను, పార్టీ కార్యకర్తలను పలకరిస్తూ ముందుకుసాగారు.

### దోశ వేసిన రాహుల్‌గాంధీ

జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాజారం, నూకపల్లి న్యాక్ బస్టాండ్ వద్ద మొబైల్ టిఫిన్ సెంటర్‌లో రాహుల్‌గాంధీ దోశ వేశారు. దోశ తింటూ స్థానికులతో ముచ్చటించారు. దంపతులను మాట్లాడించి, వారి పిల్లలకు చాక్లెట్స్ ఇచ్చారు. గౌడ సంఘం నాయకులు మోకు అందజేశారు. జగిత్యాల కొత్తబస్టాండ్‌కు చేరుకోగా.. అప్పటికే అక్కడికి భారీగా వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు.. 'రాహుల్ పీఎం..' అంటూ నినాదాలు చేశారు. బస్సు ఎక్కిన రాహుల్‌గాంధీ దాదాపు 36 నిమిషాలపాటు ప్రసంగించారు. జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి జీవన్‌రెడ్డిని, ధర్మపురి ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తన ప్రసంగాన్ని తెలుగులో బాగా అనువదించారని జీవన్‌రెడ్డిని రాహుల్‌గాంధీ అభినందించారు. రాహుల్ వెంట టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, నాయకులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్, శ్రీధర్‌బాబు, మాణిక్‌రావుఠాక్రే, వేణుగోపాల్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

### జగిత్యాల నుంచి కోరుట్ల వైపు..

రాహుల్‌కు మేడిపల్లిలో వేములవాడ నియోజకవర్గ అభ్యర్థి ఆది శ్రీనివాస్ వేములవాడ రాజన్న ప్రసాదం అందించారు. కోరుట్లలో భారీ సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు నర్సింగారావు, కోమటిరెడ్డి కరంచంద్, కృష్ణారావు, సుజిత్‌రావు స్వాగతం పలికారు. కోరుట్ల శివారులోని ముక్క కన్వెన్షన్ సెంటర్‌లో భోజనం చేసి మెట్‌పల్లికి వెళ్లారు. కారులో నుంచే ప్రజలకు అభివాదం చేస్తూ ఆర్మూర్ బయలుదేరి వెళ్లారు.

### దొంగల బెడద

యాత్రలో కార్యకర్తలకు దొంగల బెడద వెంటాడింది. జగిత్యాలతోపాటు మేడిపల్లిలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. జగిత్యాల కొత్తబస్టాండ్‌లో భారీ సంఖ్యలో ప్రజలు గుమిగూడడంతో దొంగలు పలువురి పర్సులను ఎత్తుకెళ్లారు.

## హోటల్ వద్ద సందడి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లో గురువారం రాత్రి రాహుల్‌గాంధీ స్థానిక హోటల్–వీ పార్క్‌లో బసచేశారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ కార్యకర్తలు, నాయకులు శుక్రవారం ఉదయం భారీగా హోటల్ వద్దకు చేరుకున్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు సైతం రావడంతో పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. కాంగ్రెస్ నేతలు కేసీ వేణుగోపాల్, మాణిక్‌రావుఠాక్రే, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, మధుయాష్కీ హోటల్‌లోనే బసచేశారు. రాహుల్‌ను కలిసేందుకు ఉదయమే ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, రాజయ్య, మాజీ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వంశీచందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణతోపాటు స్థానిక నాయకులు హోటల్ వద్దకు వచ్చారు. తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ కోదండరాంతో రాహుల్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

### 'సేవ్ కాంగ్రెస్..సేవ్ చెన్నూర్' అంటూ..

హోటల్ ఎదుట చెన్నూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు ప్లకార్డులు ప్రదర్శించారు. 'రాహుల్ గాంధీకి జై.. సేవ్ కాంగ్రెస్..సేవ్ చెన్నూర్'.. అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. గమనించిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు వారికి నచ్చజెప్పారు.

### సెంచరీ కొడతాం

అసెంబ్లీ ఎన్నికల్లో సెంచరీ కొట్టి అధికారంలోకి వస్తామని నల్గొండ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ బస చేసిన కరీంనగర్‌లోని హోటల్ వీ–పార్క్ వద్దకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పని అయిపోయిందని, ప్రజలు వారిని తిరస్కరించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

### ఉచిత విద్యుత్ ఘనత కాంగ్రెస్‌దే

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఎమ్మెల్సీ, జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల కార్నర్ మీటింగ్‌లో ముందుగా జీవన్‌రెడ్డి మాట్లాడారు. నిరుద్యోగులు ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుల కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### ఈవీఎంల రాండమైజేషన్ పూర్తి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: శాసనసభ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంల మొదటి రాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అఖిలపక్షం నాయకుల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లోని యూనిట్లు, బ్యాలట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల రాండమైజేషన్ నిర్వహించారు. ఈ ప్రక్రియను స్క్రీన్‌పై చూపించారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు సంబంధించిన కంట్రోల్ యూనిట్లను, బ్యాలెట్ యూనిట్లను, వీవీ ప్యాట్ జాబితాను రాజకీయ పక్షాలకు అందించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను అనుసరిస్తూ.. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పక్షాల నాయకులు సహకరించాలని కలెక్టర్ కోరారు. అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఎస్.ఆనంద్‌కుమార్, మధుసూదన్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### మద్యం ఏరులైపారుతోంది



బతుకమ్మ పేరుస్తున్న విమలక్క

వేములవాడ: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో నీళ్లు, నిధులు, నియామకాలకు బదులు మద్యం, గంజాయి ఏరులై పారుతోందని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్‌పర్సన్ విమలక్క పేర్కొన్నారు. వేములవాడలో శుక్రవారం జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకలకు హాజరైన విమలక్క ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. యువతకు ఉద్యోగాల కల్పన కలగా మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్రం మాఫియాల చేతుల్లోకి వెళ్లిపోయిందన్నారు. ఇప్పటికైనా జనం మేల్కొని ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## క్లుప్తంగా

### పరామర్శ

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య



మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఆగయ్య

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** ఇటీవల మండలంలో మృతిచెందిన పలువురి కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య శుక్రవారం పరామర్శించారు. రాచర్లబొప్పాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ రామభీమేశ్వర్ తల్లి రామ యశోద, ఉచ్చిడి గోపాల్‌రెడ్డి భార్య ప్రమీల అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబాలను ఆగయ్య పరామర్శించారు. బొమ్మన వేని కృష్ణ, ఇల్లందుల శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి ఉన్నారు.

### సారా తయారీ కేంద్రంపై దాడి

● రెండు లీటర్ల సారా పట్టివేత

**ముస్తాబాద్(సిరిసిల్ల):** ముస్తాబాద్ మండలం సేవాలాల్‌తండాలో సారా తయారు చేస్తున్న వ్యక్తి ఇంటిపై దాడి చేసి రెండు లీటర్లసారాను స్వాధీనం చేసుకున్నామని హెడ్‌కానిస్టేబుల్ భూమయ్య శుక్రవారం తెలిపారు. ధరంసోత్ మాన్‌సింగ్(45) ఇంట్లో సారా తయారు చేస్తున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించామన్నారు. మాన్‌సింగ్ వద్ద రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### నాటుబాంబు పేలి ఆవుకు గాయాలు

**కోనరావుపేట(వేములవాడ):** అటవీ జంతువుల కోసం పెట్టిన నాటుబాంబు పేలి ఆవు గాయపడింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం గొల్లపల్లి(వట్టిమల్ల) శివారులోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద భుక్యా రూప్‌సింగ్ అనే రైతు తన ఆవును మేత కోసం తీసుకొచ్చాడు. ఆవు మేత మేస్తుంటూ వెళ్లగా గడ్డిలో బాంబును నోటకర్చుకోగానే అది పేలింది. ఈ ప్రమాదంలో ఆవు తలకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా గొల్లపల్లి, వట్టిమల్ల గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో కొందరు వేటగాళ్లు కొంతకాలంగా వన్యప్రాణులను వేటాడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వన్యప్రాణుల వేట జరుగుతున్నా అటవీ శాఖ అధికారులు స్పందించడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. కోనరావుపేట పోలీసులు చేరుకుని సంఘటన స్థలాన్ని సందర్శించారు.

### పోరాటాలతోనే హక్కుల సాధన

● ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లేశం



మాట్లాడుతున్న సామల మల్లేశం

**సిరిసిల్లటౌన్:** పోరాటాలతోనే కార్మిక, కర్షక, ఉద్యోగులు హక్కులను సాధించుకోవచ్చని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల మల్లేశం కోరారు. సిరిసిల్ల కార్మిక భవనంలో శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జరిగిన అంగన్‌వాడీ, మధ్యాహ్న కార్మికులు, ఏఎన్ఎం, ఎన్‌హెచ్ఎం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వివిధ శాఖల కార్మికులను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తమ హక్కుల సాధనకు పోరాటాలు జరిపారన్నారు. పోరాడితేనే ఏదైనా సాధించవచ్చన్నారు. ఈనెల 31న ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకల మహాసభను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నిరంగాల కార్మికులు, ఉద్యోగులు, కర్షకులు పాల్గొనాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, కడారి రాములు, పంతం రవి, మీసం లక్ష్మణ్, అజ్జ వేణు తదితరులు పాల్గొన్నారు.

# అమరుల యాదిలో..

● ప్రజారక్షణలో ప్రాణాలర్పించిన పోలీసులు ఎందరో..
● నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం
● కట్టలింగంపేటలో పోలీస్ అమరులకు నివాళి



**సిరిసిల్ల:** సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు త్యాగాలు వెలకట్టలేనివి. కంటి మీద కునుకులేండా విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు ఎందరో ప్రజారక్షణలో ప్రాణాలు కోల్పోయారు. విధినిర్వహణలో అసువులు బాసిన అమరులను స్మరిస్తూ ఏటా అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్నారు. జిల్లా గతంలో కల్లోల ఖిల్లాగా ఉండేది. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో హింసాత్మక ఘటనలకు వేదికగా నిలిచేది. మావోయిస్టు నక్సలైట్ ఉద్యమం తీవ్రంగా ఉన్న రోజుల్లో పోలీసుల విధులు కత్తిమీద సాములా ఉండేవి. ఆ సమయంలో జరిగిన కొన్ని సంఘటనల్లో చాలా మంది అసువులు బాశారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ ప్రత్యేక కథనం.

**యూనిఫామ్ సేవలు**

ఖాకీ డ్రెస్ వేసుకోవాలనే కోరిక చాలా మందిలో ఉంటుంది. అయితే కొందరికే ఆ అదృష్టం దక్కుతుంది. పోలీస్ విధులు అంటేనే అలుపెరగని పోరాటం. పండుగలు, ఆత్మీయుల శుభకార్యాలకు సైతం దూరంగా ఉంటుంటారు. శాంతిభద్రతల పరిరక్షణలో అసాంఘిక శక్తులు విసిరే సవాళ్లను దీటుగా ఎదుర్కొంటూ తమ ప్రాణాలను సైతం లెక్క చేయడం లేదు. జనాభాకు అనుగుణంగా రక్షణ వ్యవస్థలో పోలీసుల సంఖ్య లేకపోయినా.. ఉన్న వారితోనే ముందుకెళ్తున్నారు.

**అసువులు బాసిన అమర పోలీసులు**

ఒకప్పుడు సిరిసిల్ల కల్లోలిత ప్రాంతంగా నక్సల్స్ ఉద్యమాలతో అట్టుడికిపోయింది. మూడు తుపాకుల మధ్య కల్లోలం నిత్యకృత్యమైంది. ఒక్కటి మావోయిస్టులు, మరొకటి జనశక్తి, సమాజ రక్షణకు పోలీసులు. ఇలా మూడు తుపాకుల మధ్య జనజీవనం రెండు దశాబ్దాలపాటు సాగింది. నక్సల్స్ ఉద్యమాలతో జిల్లా 1985 నుంచి 2006 వరకు రణరంగమే అయింది.

- 1991లో ఎల్లారెడ్డిపేట గాంధీ విగ్రహం వద్ద శ్రీనివాసరావు అనే హోంగార్డును అప్పటి పీపుల్స్‌వార్ నక్సలైట్లు చంపేశారు.
- 1993లో అప్పటి గంభీరావుపేట ఎస్సైగా పనిచేస్తున్న సాబీర్‌ఖాన్‌ను మావోయిస్టు నక్సలైట్లు కాల్చిచంపారు. ఆయన శుక్రవారం పూట మజీద్‌లో నమాజు చేసుకునేందుకు వెళ్లగా అక్కడే మాటువేసిన నక్సలైట్లు కాల్చిచంపారు.
- 1992లో ఇదే సాబీర్‌ఖాన్ కోనరావుపేట ఎస్సైగా పనిచేస్తున్న కాలంలోనూ ఆయనపై పీపుల్స్‌వార్ నక్సలైట్లు కాల్పులు జరిపారు. కోనరావుపేట మండలం మర్తనపేట–ధర్మారం శివారులో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న సాబీర్‌ఖాన్‌పై కాల్పులు జరిపారు. త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఆయన మోటార్ సైకిల్‌ను నక్సలైట్లు అక్కడే దహనం చేశారు. 1992లో తప్పించుకున్న సాబీర్‌ఖాన్ గంభీరావుపేటలో వారి చేతుల్లోనే అసువులు బాశారు.
- 1996లో కోనరావుపేట మండలం నిజామాబాద్ శివారులో మావోయిస్టులు పేల్చిన మందుపాతరలకు నజీర్, మోహన్‌యాదవ్ అనే ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లు చనిపోయారు. ఈ ఘటనలో అప్పటి కోనరావుపేట ఎస్సై రవీందర్‌రెడ్డి, ఏఎస్సై నాయుడు త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.
- 1997లో కోనరావుపేట మండలం వట్టిమల్ల వద్ద చంద్రశేఖర్ అనే హోంగార్డును మావోయిస్టులు కాల్చి చంపి, బైక్‌పై శవాన్ని తెచ్చి పడేశారు.
- 1998లో అప్పటి కోనరావుపేట ఎస్సై ముసిపట్ల శ్రీనివాస్‌గౌడ్‌ను మావోయిస్టు నక్సలైట్లు ఎగ్లాస్‌పూర్ గుట్టల్లో కాల్చి చంపారు.
- 1999లో చందుర్తి మండలం కట్టలింగంపేట–రుద్రంగి మధ్య పోలీసుల జీపును పీపుల్స్‌వార్ నక్సలైట్లు మందుపాతరతో పేల్చివేయగా.. అప్పటి చందుర్తి ఎస్సై శ్రీనివాసరావు అసువులు బాశారు. ఈ ఘటనలో జీపు నుజ్జు నుజ్జు అయింది.
- 2000లో కోనరావుపేట మండలం వట్టిమల్ల గిరిజనతండాలో జనశక్తి నక్సలైట్ల చేతిలో కానిస్టేబుళ్లు హెంకూనాయక్, కృష్ణ బలయ్యారు.

**పోలీసు అమరవీరుల స్తూపం**

చందుర్తి మండలం కట్టలింగంపేట వద్ద పోలీసు అమరవీరుల స్తూపాన్ని 2014లో అప్పటి సిరిసిల్ల డీఎస్పీ దామెర నర్సయ్య నిర్మించారు. హైదరాబాద్ తరహాలో స్తూపాన్ని డిజైన్ చేసి, స్వయంగా దగ్గరు ఉండి మరీ కట్టించారు. ఇప్పటికీ ఇదే స్తూపం వద్ద ఏటా అక్టోబర్ 21న పోలీసుల అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు అమరవీరుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నారు.

### బీర్పూర్‌లోనూ స్తూపం నిర్మించాను



నేను జగిత్యాల జిల్లాలోని బీర్పూర్‌లో పోలీసు అమర వీరుల స్తూపాన్ని 2005లో నిర్మింపజేశాను. అది పీపుల్స్‌వార్ అగ్రనేత ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి సొంతూరు. ఆ ఊరిలో పోలీసుల అమర వీరుల స్తూపాన్ని నిర్మించాం. నేను సిరిసిల్ల డీఎస్పీగా పనిచేసినప్పుడు కట్టలింగంపేటలోనూ స్తూపాన్ని కట్టించాను. ఇలాంటి కొన్ని పనులు జీవితంలో మైలురాయిగా నిలిచిపోతాయి.

– దామెర నర్సయ్య, రిటైర్డ్ డీఎస్పీ

### పోలీసుల త్యాగం వెలకట్టలేనిది



ప్రాణాలను పణంగా పెట్టడం కంటే త్యాగం మరొకటి ఏదీ ఉండదు. అక్టోబర్ 21 నుంచి పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తాం. స్కూల్‌లో వ్యాసరచన పోటీలు, సైకిల్‌ర్యాలీ, సిరిసిల్లలో కొవ్వొత్తుల ర్యాలీ, షార్ట్‌ఫిల్మ్, పోలీసులతోపాటు అందరికి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తాం. విధి నిర్వహణలో పోలీసులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. వారి కుటుంబాలకు ఏమిచ్చినా తక్కువే. నిస్వార్థ సేవకు పోలీసు అమరవీరులే నిదర్శనం.

– అఖిల్ మహాజన్, ఎస్పీ

### ఎదురుకాల్పుల్లో పట్టుబడినా..



మాది వీర్నపల్లి మండలం గర్జనపల్లి. నేను 1997లో మావోయిస్టు ఉద్యమంలో చేరాను. ఉత్తర తెలంగాణ స్పెషల్ జోన్ కమిటీలో ఉన్నాను. 1999లో ఓసారి అప్పటి పీపుల్స్‌వార్ జిల్లా కార్యదర్శి పద్మక్క, బాబన్న, సాగర్ మరో 16 మంది సాయుధులం కోనరావుపేట మండలం వట్టిమల్లకు చేరుకుంటున్నాం. రాత్రి 9 గంటలు అవుతుంది. అప్పటికే పోలీసులు మా కోసం మాటు వేసి అంబుష్‌లో ఉన్నారు. అది గమనించకుండా చీకట్లో వస్తున్నాం. కౌన్ హై అంటూ పోలీసుల గద్దరింపు.. మీరెవరూ అంటూ.. మా సమాధానం. అంతే.. కాల్పులు మొదలయ్యాయి. రాత్రి 10.30 గంటల వరకు కాల్పులు సాగుతూనే ఉన్నాయి. నేను నా కిట్ బ్యాగుతో అడవిలోకి పారిపోయి, ఆలివ్‌గ్రీన్ డ్రెస్సును మార్చుకుని, చీరకట్టుకున్న. తెల్లవారుజామున 5 గంటలకు పోలీసులు నన్ను అడవుల్లో చుట్టుముట్టారు. ఇక నేను బతకనని అనుకున్న. తునికాకు కోసం అడవిలోకి వచ్చిన అని అబద్ధం చెప్పిన. ఊరి శివారులో కాల్పులు జరిగిన ప్రదేశానికి నన్ను తెచ్చారు. అక్కడ ప్రజలు నన్ను గుర్తుపట్టారు. పోలీసులు కొంత ఆలస్యంగా నేను దళ సభ్యురాలి నని గుర్తించారు. కానీ నన్ను చంపకుండా.. మానవత్వంతో అప్పుడు అరెస్ట్ చేశారు. జైలు కెళ్లి విడుదలైన తరువాత మళ్లీ ఉద్యమంలోకి వెళ్లాను. ఎనిమిదేళ్లపాటు పనిచేశాను. మద్దిమల్ల, ఆదిలాబాద్ జిల్లా లక్ష్మీపూర్, మానాల ఎదురుకాల్పుల నుంచి తప్పించుకున్నాను. 2005లో ఇప్పటి వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి నన్ను ఎస్పీ ముందు సరెండర్ చేశారు. ఇప్పుడు నేను హోంగార్డుగా పనిచేస్తున్న.

– గుంటుక అనసూర్య, హోంగార్డు, మాజీ నక్సలైట్, సిరిసిల్ల

# 258 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు

● వడ్లను ఆరబెట్టి కేంద్రాలకు తేవాలి
● కలెక్టర్ అనురాగ్ జయంతి



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

**సిరిసిల్ల:** జిల్లాలో 258 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పౌరసరఫరాలు, సహకార, వ్యవసాయ, డీఆర్‌డీఏ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా ఉండగా.. ఇందుకు అవసరమైన 87 లక్షల గన్నీబ్యాగులు అందుబాటులో ఉంచాలని కోరారు. 6,634 టార్పాలిన్లు, 632 పాడీ క్లీనర్‌లు, 620 తేమను కొలిచే మెషీన్లు, 816 ఎలక్ట్రానిక్ తూకం మెషిన్లు అందుబాటులో ఉన్నాయని అధికారులు వివరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరారు. దళారులను నమ్మి మోసపోవద్దని, వడ్లను ఆరబెట్టి కేంద్రాలకు తేవాలని సూచించారు. ఆధార్‌కార్డు, వ్యవసాయ విస్తరణాధికారులతో ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని, పాస్‌బుక్కు జిరాక్స్ కాపీలు వెంట తేవాలని సూచించారు. తూకం వేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలని, అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్, డీఆర్‌డీవో ఎస్.శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి బుద్ధనాయుడు, ఆర్డీవో వై.కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# పారా హుషార్ !

● పండుగ పూట స్వగ్రామాలకు వెళ్తున్నారా!
● బంగారు నగలను జాగ్రత్తగా ఉంచుకోండి..
● చుట్టుపక్కల వారికి సమాచారం ఇవ్వండి
● జిల్లా పోలీసుల సూచనలు



దొంగతనం జరిగిన ఇల్లు (ఫైల్)

**సిరిసిల్లక్రైం:** తెలంగాణ ప్రజల అతి పెద్ద పండుగ బతుకమ్మ. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో జిల్లా కేంద్రం, మండల కేంద్రాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు స్వగ్రామాలకు వెళ్తున్నారు. అయితే ఇదే సమయంలో జాగ్రత్తగా ఉండాలని, విలువైన బంగారు, వెండి ఆభరణాలను ఇంట్లోని పెట్టి వెళ్లొద్దంటున్నారు. వీలుంటే వెంట తీసుకెళ్లాలని.. లేకుంటే బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచిస్తున్నారు. అదే సమయంలో ఎక్కువ రోజులు తాళాలు వేసి ఉంచొద్దని.. అప్పుడప్పుడు వచ్చి పరిశీలిస్తూ ఉండాలని, చుట్టపక్కల వారిని గమనించేలా చూడాలని చెప్పాలని సూచిస్తున్నారు. ఇటీవల జిల్లాలో దొంగతనాలు పెరగడంతో పోలీసులు సైతం అప్రమత్తమయ్యారు.

**తాళం వేసిన ఇండ్లే లక్ష్యం**

పండుగల వేళ తాళాలు వేసే ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు. వీటిని అరికట్టేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. వీలైతే ఇంట్లో ఒకరు ఉండేలా వీలు చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఇలా కుదరని సందర్భంలో ఇంటిలో వారందరూ ఊరెళ్లితే తప్పనిసరిగా సంబంధిత స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు. దొంగతనాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలకు అవగాహన కోసం వివిధ సూచనలను పోలీసులు ఇప్పటికే తెలిపారు.

**జనవరి నుంచి ఇప్పటి వరకు జరిగిన దొంగతనాలు**

| | |
|---|---|
| నమోదైన కేసులు | : 233 |
| చేధించిన కేసులు | : 91 |
| అరెస్టయిన వ్యక్తులు | : 122 |
| సొత్తు రికవరీ | : రూ.32,06,570 |

**పోలీసుశాఖ సూచనలు**

- ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదును బ్యాంకు లాకర్‌లో భద్రపర్చుకోవాలి.
- బీరువా తాళాలు ఇంటిలోనే ఉంచకుండా వెంట తీసుకెళ్లాలి.
- విలువైన వస్తువులు, వ్యక్తిగత విషయాలను ఇతరులకు చెప్పొద్దు.
- ఇంటి ప్రధాన ద్వారానికి సెంట్రల్ లాకింగ్ సిస్టం, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. మొబైల్‌లో వీక్షించే విధానం పెట్టుకోవాలి.
- ఎట్టి పరిస్థితుల్లో బయట గేటుకు తాళం వేయకూడదు, లోపలి నుంచి గడియ పెట్టాలి.
- ఇంటిలోపల, బయట లైట్ వేసి ఉంచాలి.
- అపార్ట్‌మెంట్‌లో సీసీ కెమెరాలు, వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసుకోవాలి.
- సంబంధిత పోలీస్ స్టేషన్, విలేజ్ పోలీసు ఆఫీసర్‌కు సమాచారం ఇవ్వాలి.
- స్వగ్రామాలకు వెళ్లే వారు చుట్టుపక్కల వారికి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలి.
- అనుమానితులు సంచరిస్తే డయల్ 100లో సమాచారం ఇవ్వాలి.

**ముందస్తు జాగ్రత్తలే మేలు**

సెలవుల్లో స్వగ్రామాలకు వెళ్లే వారు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. నగలు, నగదును వెంట తీసుకెళ్లడం ఉత్తమం. లేదంటే బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలి. కొత్త వారు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం శ్రేయస్కరం.

– అఖిల్ మహాజన్, రాజన్నసిరిసిల్ల జిల్లా ఎస్పీ

### అర్ధరాత్రి ఆపదొచ్చినా అండగా నిలుస్తా

● వారెంట్ లేని గ్యారంటీ పథకాలకు మోసపోవద్దు
● బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

జంగ్ తెలంగాణ



చందుర్తిలో మాట్లాడుతున్న చల్మెడ

**చందుర్తి(వేములవాడ):** అర్ధరాత్రి ఆపద వచ్చినా అండగా నిలుస్తానని.. వేములవాడ ఎమ్మెల్యేగా గెలిపించాలని బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు కోరారు. చందుర్తిలోని పెరుక కమ్యూనిటీ భవనంలో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడ్డాక చందుర్తి మండలంలో రూ.258 కోట్లతో అభివృద్ధి పనులు చేసుకున్నామన్నారు. తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలను గడపగడపకు కార్యకర్తలు తీసుకెళ్లాలని కోరారు. బేధాభిప్రాయాలు పక్కన పెట్టి 40 రోజులు కలిసికట్టుగా పనిచేస్తే గెలుపు సాధ్యమవుతుందన్నారు. ఆకలితో కాకుండా ఆశయంతో రాజకీయాల్లోకి వచ్చానని, మాటిస్తే తలను తాకట్టు పెట్టయినా నెరవేరుస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ వారెంటీ లేని గ్యారంటీ పథకాలతో ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెడుతుందని ఆరోపించారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే వేములవాడ నియోజకవర్గాన్ని వెన్నెలవాడగా మారుస్తానన్నారు. వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ బతుకులు మారాలని పోరాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని మళ్లీ కాంగ్రెస్ నాయకుల చేతిలో పెడుదామా అని ప్రశ్నించారు. పార్టీ మండలాధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, ఉప్పులేటి గోవిందరావు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్యయాదవ్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, చందుర్తి, సనుగుల సింగిల్ విండో అధ్యక్షులు తిప్పని శ్రీనివాస్, జలగం కిషన్‌రావు, రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, మాజీ చైర్మన్ దప్పుల అశోక్, ఎంపీపీ లావణ్య, వైస్‌ఎంపీపీ అబ్రహం, మండల కోఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్ పాల్గొన్నారు.

**ఆరు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తాం**

**వేములవాడఅర్బన్:** మధ్యమానేరు ముంపు గ్రామాల నిర్వాసితుల బాధలు వర్ణనాతీతమని, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సమస్యలు పరిష్కరిస్తామని బీఆర్ఎస్ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. వేములవాడ మండలం చీర్లవంచలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ బూర వజ్రమ్మ, జెడ్పీటీసీ మ్యాకల రవి, సర్పంచ్ రంగు సత్తమ్మ, ఎంపీటీసీ వనపర్తి దేవరాజు, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, వైస్‌ఎంపీపీ రవిచందర్‌రావు, ఉపసర్పంచ్ శ్రీనివాస్, జక్కుల నాగరాజు పాల్గొన్నారు.

### కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మొద్దు

● ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



బోయినపల్లిలో బీడీ కార్మికులతో వినోద్‌కుమార్

**బోయినపల్లి(చొప్పదండి):** కాంగ్రెస్, బీజేపీల మోసపూరిత వాగ్దానాలు నమ్మొద్దని ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. మండలకేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మల్లాపేటలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాన్ని అమలుకాని హామీలు ఇచ్చే వారి చేతుల్లో పెట్టొద్దని కోరారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ స్థానికంగా ఉంటూ అందరితో కలిసి ఉండే తనకు మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు, డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, సర్పంచులు జోగినిపల్లి ప్రేమ్‌సాగర్‌రావు, గుంటి లతశ్రీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తీపిరెడ్డి కిషన్‌రెడ్డి, కొనుకటి లచ్చిరెడ్డి, గుడ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ చౌర్యం కేసులో జరిమానా

**కొత్తపల్లి(కరీంనగర్):** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని బట్టపల్లికి చెందిన కొక్కుల సురేశ్‌కు విద్యుత్ చౌర్యం కేసులో న్యాయమూర్తి జరిమానా విధించినట్లు ఉమ్మడి జిల్లా విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సురేశ్ తన ఇంటికి విద్యుత్ అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా విద్యుత్ వినియోగించాడు. అతన్ని పట్టుకున్న అధికారులు మొదటి నేరంగా భావించి, రూ.1,000 జరిమానా విధించి వదిలేశారు. సురేశ్ రెండోసారి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసిన అధికారులు, అతన్ని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం జగిత్యాల జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ఎస్.నారాయణ ఎదుట సురేశ్‌ను హాజరుపర్చగా విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. దీంతో జడ్జి అతనికి రూ.83,390 జరిమానా చెల్లించాలని లేదంటే ఆరు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పు వెల్లడించారు. సీఐ వెంట ఎస్సై టి.నరేశ్, విజిలెన్స్ సిబ్బంది ఉన్నారు.

### అతివేగంతో హెడ్ కానిస్టేబుల్‌ను ఢీకొట్టిన వ్యక్తి



గాయపడిన హెడ్ కానిస్టేబుల్

**వెల్గటూర్(ధర్మపురి):** ఎన్నికల విధుల్లో భాగంగా వాహనాల తనిఖీ చేస్తున్న హెడ్ కానిస్టేబుల్‌ను ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. స్థానికుల వివరాలు.. ధర్మారం నుంచి వెల్గటూర్ వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న దండెపల్లి మండల కేంద్రానికి చెందిన కట్కూరి సతీశ్ వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేట స్టేజీ వద్ద విధి నిర్వహణలో భాగంగా వాహనాల తనిఖీ చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ బహదూర్‌ను అతివేగంగా ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన హెడ్ కానిస్టేబుల్‌ను పోలీసులు చికిత్స నిమిత్తం కరీంనగర్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన సతీశ్ స్వల్పంగా గాయపడగా ధర్మారం ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.